ప్రజా పక్షం..

TS-27-0016491

జయ జయహే
# సూర్యోదయం

ప్రజా గొంతు..


**విలేకరులు కావలెను**

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న సూర్యోదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 9515342857

హైదరాబాద్ | సంపుటి -2 | సంచిక -21 | పేజీలు : 8 | ఎడిటర్ : శివకృష్ణ | మంగళవారం 2 జూన్ 2026 | వెల : 4/-

## దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే
# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు



- వాళ్లు విధ్వంసం చేశారు.. బాగు చేసేందుకు మేము కష్టపడుతున్నాం
- ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారు
- పవర్ కోసం కోడికత్తి, గులకరాయి డ్రామాలు కూడా ఆడారు
- పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- ఆ పార్టీ నేతలు అసత్య ప్రచారాలే పనిగా పెట్టుకున్నారని మండిపాటు

**చామవరం**

వైసీపీ హయాంలో రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తే బాగు చేసేందుకు తాము రేయింబవళ్లూ కష్టపడాల్సి వస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరంలో సోమవారం నిర్వహించిన పేదల సేవలో కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బాగు చేసేందుకు రాత్రింబవళ్లు మేం పనిచేస్తున్నాం. గత పాలకులు మాత్రం విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారు. సుపరిపాలనను వెనక్కు లాగేందుకు గొడ్డలి పార్టీ కుట్రలు కుతంత్రాలు పన్నుతోంది. అందుకే ప్రస్తుతం ఉన్న ప్రతిపక్షాన్ని గొడ్డలి పార్టీ అంటున్నాం. బాబాయి వివేకానందరెడ్డిని హత్యచేసి గుండెపోటు అన్నారు. పోస్టుమార్టం తర్వాత తెలిసింది గొడ్డలితో నరికి చంపారని. మానాన్న చనిపోయారు ఇప్పుడు చిన్నాన్న కూడా చంపేశారని ఎక్కడికక్కడ డ్రామాలు ఆడారు. ఒక్క ఛాన్స్ అన్నారు మోసం చేశారు. కోడికత్తి, గులకరాయి డ్రామాలు కూడా ఆడారు. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు - మిగతా3లో



## ఈ సారి యోగా
# రెండు వారాలు

- కోటి మందిని భాగస్వాములను చేసేలా చర్యలు
- రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఏర్పాట్లు
- ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటుకు సీఎం ఆమోదం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి**

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను రాష్ట్రంలో 'యోగాంధ్ర--2026' పేరుతో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్ అనే విశిష్ట నినాదంతో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) - మిగతా3లో



బీజేపీపై అన్నామలై
# అసంతృప్తి

- త్వరలోనే కొత్త పార్టీ- రెండు రోజుల్లో క్లారిటీ!
- తమిళనాట రాజకీయాల్లో కొత్త ప్రచారం
- బీజేపీని వీడి కొత్త పార్టీని స్థాపించనున్న అన్నామలై?
- దీనిపై ఆయన రియాక్షన్ ఏంటంటే?

## జమ్ముకశ్మీర్‌లో తగ్గిన ఉగ్రవాదం!

- మే నెలలో 'నో కిల్లింగ్స్?'
- గత 30 ఏళ్లలో మొదటిసారి ప్రశాంతత!
- జమ్ముకశ్మీర్‌లో 4,011 నుంచి 12కు పడిపోయిన వార్షిక మరణాలు
- ఉగ్రవాదం తగ్గిందా?



దేశంలో జల వనరుల నిర్వహణ కోసం
## ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్


దేశంలో కొత్త జల పరిశోధన కార్యక్రమాలకు నాంది

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో ఒప్పందం కుదుర్చుకున్న కేంద్ర జలశక్తి శాఖ

అగ్రిమెంట్‌పై సంతకాలు చేసిన ఇరువర్గాలు

## మారుతున్న రియల్ ఎస్టేట్ ముఖచిత్రం...

- విశాఖ సహా ఈ 8 నగరాలపైనే అందరి దృష్టి!
- రియల్ ఎస్టేట్ పెట్టుబడులు మెట్రోల నుంచి టైర్-2 నగరాలకు మళ్లుతున్నాయి
- మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు ఈ నగరాల పురోగతికి కారణం
- తక్కువ ధరల్లో ఆస్తులు, అధిక రాబడికి ఆస్కారం ఉండటంతో పెరుగుతున్న ఆసక్తి
- విశాఖపట్నం సహా దేశంలోని 8 నగరాలు రియల్ ఎస్టేట్ వృద్ధికి కేంద్రాలుగా మార్పు




# ఏఐ హబ్‌గా విశాఖ ఎదుగుదల



- ఎయిర్‌ట్రంక్ సీఈవోతో మంత్రి లోకేశ్ భేటీ
- ఏపీలో పెట్టుబడులకు ఆహ్వానం
- వివిధ దేశాల్లో డేటా సెంటర్లు నిర్వహిస్తున్న హైపర్ స్కేల్ డేటా సంస్థ ఎయిర్ ట్రంక్
- ఏఐ, డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా వైజాగ్ ఆవిర్భవిస్తోందన్న మంత్రి లోకేశ్

**ముంబై**

ప్రపంచవ్యాప్తంగా హైపర్‌స్కేల్ డేటా సెంటర్లను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ ఎయిర్‌ట్రంక్ సీఈవో రాబిన్ ఖుదాతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ముంబైలో సమావేశమయ్యారు. ఆసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్, ఆస్ట్రేలియా, జపాన్, మలేషియా, హాంకాంగ్, సింగపూర్‌లలో భారీ డేటా సెంటర్లను ఎయిర్‌ట్రంక్ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ 'ఏఐ, - మిగతా3లో



దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో
## రాజ్యసభ ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల
- దేశవ్యాప్తంగా 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ద్వైవార్షిక ఎన్నికలు
- బీహార్, కర్ణాటకలో శాసనమండలి స్థానాలకు కూడా ఎన్నికలు
- జూన్ 18న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా నోటిఫికేషన్ జారీ

## గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు
# కట్టకపోవడమేంటి?




- పరిశ్రమలు పన్ను చెల్లించకపోవడంపై పవన్ ఆగ్రహం
- పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకుపైగా వస్తాయని వెల్లడి
- రాజకీయ ఒత్తిళ్లున్నా పన్నుల విషయంలో ముందుకెళ్లాలని అధికారులకు ఆదేశం

**అమరావతి**

పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్షించారు. పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి పన్ను వసూళ్లు ఎందుకు సరిగా ఉండటం లేదని అధికారులను అడిగారు. రాజధాని నుంచి ఉన్నతాధికారులతో కలిసి పవన్ నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. తమ ప్రాంతాల్లో పన్ను వసూళ్ల వివరాలను - మిగతా3లో

# మారుతున్న రియల్ ఎస్టేట్ ముఖచిత్రం

భారత రియల్ ఎస్టేట్ రంగంలో ఒక స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ఇప్పటివరకు పెట్టుబడిదారులకు స్వర్గధామాలుగా ఉన్న ముంబై, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల నుంచి దృష్టి నెమ్మదిగా టైర్-2 నగరాల వైపు మళ్లుతోంది. మౌలిక సదుపాయాల విస్తరణ, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పెరుగుతున్న ఉపాధి అవకాశాలతో ఈ నగరాలు రియల్ ఎస్టేట్ వృద్ధికి కొత్త చోదక శక్తులుగా మారుతున్నాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ నగరాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా భవిష్యత్తులో మంచి మూలధన వృద్ధి, అద్దె రూపంలో అధిక రాబడి పొందేందుకు అపారమైన అవకాశాలున్నాయి.



**టైర్-2 నగరాల వైపే ఎందుకు?**


దేశవ్యాప్తంగా టైర్-2 నగరాల్లో కనిపిస్తున్న రియల్ ఎస్టేట్ బూమ్‌కు అనేక కారణాలున్నాయి. కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ సిటీస్ మిషన్, అమృత్ వంటి పథకాల కింద ఈ నగరాల్లో మౌలిక సదుపాయాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయి. కొత్త మెట్రో లైన్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, విమానాశ్రయాల నిర్మాణం వాటి రూపురేఖలను మార్చేస్తున్నాయి. పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు పెరగడం, ప్రజల జీవనశైలిలో మార్పులు రావడం కూడా గిరాకీని పెంచుతోంది. అన్నింటికంటే ముఖ్యంగా, మెట్రో నగరాలతో పోలిస్తే ఇక్కడ ఆస్తుల ధరలు అందుబాటులో ఉండటం పెట్టుబడిదారులను ఎక్కువగా ఆకర్షిస్తోంది. నివాస గృహాలతో పాటు వాణిజ్య సముదాయాలకు కూడా డిమాండ్ ఊపందుకుంది.

**వృద్ధి పథంలో దూసుకెళుతున్న 8 నగరాలు**

1. ఇండోర్ (మధ్యప్రదేశ్): దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా ఖ్యాతి గాంచిన ఇండోర్, బలమైన ఆర్థిక వృద్ధి, అద్భుతమైన మౌలిక సదుపాయాలతో దూసుకుపోతోంది. సూపర్ కారిడార్, విజయ్ నగర్ వంటి ప్రాంతాలు హాట్‌స్పాట్‌లుగా ఉన్నాయి.
2. లక్నో (ఉత్తరప్రదేశ్): మెట్రో విస్తరణ, ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణంతో లక్నో వేగంగా రూపాంతరం చెందుతోంది. గోమతి నగర్ ఎక్స్‌టెన్షన్, షహీద్ మార్గం వంటి ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు జోరందుకున్నాయి.
3. జైపూర్ (రాజస్థాన్): ఢిల్లీ-ముంబై పారిశ్రామిక కారిడార్‌లో వ్యూహాత్మకంగా ఉండటం జైపూర్‌కు కలిసొస్తోంది. ఇక్కడ నివాస, అద్దె గృహాలకు డిమాండ్ బాగా పెరిగింది.
4. కోయంబత్తూరు (తమిళనాడు): దక్షిణ భారతదేశంలో తయారీ, ఐటీ రంగాలకు కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. అవినాశి రోడ్, శరవణంపట్టి కారిడార్లు కీలక ప్రాంతాలుగా ఉన్నాయి.
5. నాగ్‌పూర్ (మహారాష్ట్ర): ముంబై-నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వే ఈ నగరం దశను మార్చింది. లాజిస్టిక్స్, పారిశ్రామిక కేంద్రాల ఏర్పాటుతో నివాస, అద్దె మార్కెట్లలో బలమైన వృద్ధిని నమోదు చేస్తోంది.
6. భువనేశ్వర్ (ఒడిశా): తూర్పు భారతదేశంలో విద్య, ఐటీ, పరిపాలనా కేంద్రంగా ఎదుగుతోంది. స్మార్ట్ సిటీ కార్యక్రమాలు ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిస్తున్నాయి.
7. సూరత్ (గుజరాత్): వస్త్ర, వజ్రాల పరిశ్రమలకు ప్రసిద్ధి చెందిన సూరత్‌లో పట్టణీకరణ వేగంగా సాగుతోంది. అందుబాటు ధరలు, స్థిరమైన జనాభా పెరుగుదల ఇక్కడి వృద్ధికి కారణాలు.
8. విశాఖపట్నం (ఆంధ్రప్రదేశ్): పోర్ట్ ఆధారిత ఆర్థిక వ్యవస్థ, విస్తరిస్తున్న ఐటీ రంగం, పెరుగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలు విశాఖను తూర్పు తీరంలో ఒక ఆకర్షణీయమైన నగరంగా నిలుపుతున్నాయి. మౌలిక సదుపాయాల మెరుగుదల ఇక్కడి రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది.

మొత్తంమీద, ఇప్పటికే సంతృప్త స్థాయికి చేరిన మెట్రో నగరాలతో పోలిస్తే ఈ టైర్-2 నగరాలు తక్కువ ప్రవేశ ధరలు, బలమైన వృద్ధి సామర్థ్యం, మెరుగైన జీవన ప్రమాణాలను అందిస్తున్నాయి. దీర్ఘకాలిక రాబడులను ఆశించే పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ నగరాల వైపే చూస్తున్నారు.

## దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు..



దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 27 రాజ్యసభ స్థానాలు, మూడు రాష్ట్రాల్లోని శాసనమండలి స్థానాల భర్తీకి ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈ మేరకు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది.

`న్ల పరిశీలన జరుగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి జూన్ 11 వరకు గడువు ఉంటుంది. జూన్ 18న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాల్లో మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఇక శాసనమండలి ఎన్నికల విషయానికొస్తే, బీహార్‌లో 9, కర్ణాటకలో 7 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. అలాగే బీహార్‌లో నితీశ్ కుమార్ రాజీనామాతో ఖాళీ అయిన ఒక ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది.

## జమ్ముకశ్మీర్‌లో తగ్గిన ఉగ్రవాదం!

జమ్మూకశ్మీర్?లో మూడు దశాబ్దాల కంటే ముందు ప్రారంభమైన ఉగ్రవాదం నేటికీ రావణకాష్టంలా మండుతూనే ఉంది. భారత పౌరులు ఉగ్ర దాడులతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి క్రమంగా మారుతోంది. జమ్మూకశ్మీర్?లో ఉగ్రవాదం మొదలైనప్పటి నుంచి నేటి వరకు చూసుకుంటే, మొదటిసారిగా ఈ మే నెలలో ఉగ్రవాద సంబంధిత మరణాలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. అధికారిక గణాంకాల ప్రకారం, 2026 మొదటి 5 నెలల్లో కేవలం 12 ఉగ్రవాద సంబంధిత మరణాలు మాత్రమే నమోదు అయ్యాయి. ఈ మృతుల్లో 9 మంది ఉగ్రవాదులు కాగా, మన భద్రతా దళ సిబ్బందికి చెందిన ఒకరు, గుర్తింపు వివాదం ఉన్న ఒక స్థానికుడు, గుర్తు తెలియని వ్యక్తి ఉన్నారు. కాగా ఈ ఏడాది ఇప్పటి వరకు ఉగ్రదాడుల్లో సాధారణ పౌరులు ఎవరూ మరణించలేదు. జమ్మూకశ్మీర్? పోలీస్ డేటా ప్రకారం, 2000 మే నెలలో అక్కడ 288 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదు అయ్యాయి. 2001 మే నాటికి ఈ సంఖ్య 300కు చేరింది. వాస్తవానికి ఆ సమయంలో కశ్మీర్? లోయ అంతటా, జమ్మూలోని కొన్ని ప్రాంతాల్లో ఉగ్రవాదులు, పౌరులు, భద్రతా సిబ్బంది పెద్ద సంఖ్యలో మరణించారు. దాదాపు ప్రతిరోజూ అక్కడ ఈ ఉగ్రవాద సంబంధిత మరణాలు సంభవించాయి. అయితే కాలక్రమేణా అక్కడ ఉగ్ర హింస క్రమంగా తగ్గుతూ వస్తున్నప్పటికీ, మే నెల మాత్రం అత్యంత హింసాత్మక మాసంగా ఉందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ విధంగా జమ్మూకశ్మీర్?లో ఉగ్రవాద సంబంధిత మరణాలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. అయితే ఆ తర్వాతి కాలంలో ఉగ్రవాదుల వ్యూహాలు మారాయి. స్థానికుల్లో కొందరు కొత్తగా ఉగ్రవాద గ్రూపుల్లో చేరడం వల్ల టెర్రర్ డెత్స్?లో హెచ్చుతగ్గులు కనిపించాయి. అవి ఎలా ఉన్నాయంటే?

మళ్లీ పెరిగిన ఉగ్రవాదం

2016 నాటి అశాంతి తర్వాత జమ్మూకశ్మీర్?లో హింస మళ్లీ పెరిగింది. ఆ ఏడాది మే నెలలో టెర్రర్ డెత్స్? 27 వరకు నమోదుకాగా, 2017, 2018, 2019 మే నెలల్లో వరుసగా 37 చొప్పున ఉగ్రవాద సంబంధిత మరణాలు సంభవించాయి. కానీ ఆ తర్వాత కాలంలో ఉగ్రవాదం క్రమంగా తగ్గింది.

జీరోకు పడిపోయిన మరణాలు

అయితే ఈ ఏడాది (2026) మే నెలలో ఈ ఉగ్రవాద సంబంధిత మరణాలు సున్నాకు పడిపోయాయి. నిరంతర ఉగ్రవాద నిరోధక చర్యలు, నిఘా వర్గాల మధ్య మంచి సమన్వయం, స్థానిక యువత ఉగ్రవాద గ్రూపుల్లో చేరడం బాగా తగ్గిపోవడమే ఇందుకు కారణమని భద్రతాధికారులు చెబుతున్నారు. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక సీనియర్ పోలీస్ అధికారి కీలక విషయాలు వెల్లడించారు. "జమ్మూకశ్మీర్?లో ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చే వ్యవస్థలు బాగా బలహీనపడ్డాయి. అలాగే కొత్తగా ఉగ్రవాదంలోకి చేరేవారి సంఖ్య చరిత్రలోనే అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోయింది. భద్రతా సంస్థలు సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నాయి" అని పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడేందుకు అధికారిక అనుమతి లేని ఒక సీనియర్ ఆర్మీ అధికారి మాట్లాడుతూ, రెండు దశాబ్దాల క్రితం నాటి పరిస్థితులతో పోలిస్తే, నేడు జమ్మూకశ్మీర్?లో భద్రతా వాతావరణం పూర్తిగా మారిపోయిందని చెప్పారు. "ఉగ్రవాదానికి ఊతమిచ్చే వ్యవస్థ మొత్తం ఇప్పుడు బాగా కుచించుకుపోయింది. సరిహద్దుల గుండా చొరబాట్లు ఇప్పుడు మరింత కష్టతరంగా మారాయి. ఉగ్రవాద శక్తులు క్షేత్రస్థాయిలో మళ్లీ పుంజుకోకుండా భద్రతాదళాలు సమర్థవంతంగా నిరోధించగలుగుతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

**జమ్మూకశ్మీర్?లో వార్షిక మరణాలు**

జమ్మూకశ్మీర్? వార్షిక మరణాల గణాంకాలు పరిశీలిస్తే, ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తుంది. 2000లో 2799 ఉగ్రవాద సంబంధిత మరణాలు నమోదయ్యాయి. 2021లో అత్యధికంగా 4,011 మరణాలు సంభవించాయి. అందులో 1000 మందికి పైగా పౌరులు, 628 భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, 2,345 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. వాస్తవానికి ఉగ్రవాదం మొదలైన ప్రారంభ సంవత్సరాల్లో వార్షిక మరణాల సంఖ్య 3000కు పైగానే ఉండేది. కానీ ఆ తర్వాత క్రమంగా తగ్గుతూ వచ్చింది.

# బీజేపీపై అన్నామలై అసంతృప్తి

తమిళనాడు రాజకీయాల్లో కొత్త చర్చ ప్రారంభమైంది. ఆ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె అన్నామలై కొత్త రాజకీయ పార్టీ స్థాపించనున్నారంటూ ప్రచారం మొదలైంది. ఈ ఊహాగానాల నడుమ అన్నామలై సోమవారం ఢిల్లీ బయల్దేరారు. ఈ క్రమంలో ఆయన చెన్నై ఎయిర్?పోర్టులో కనిపించారు. దీంతో కొత్త పార్టీ గురించి మీడియా ప్రశ్నించగా, రెండు రోజుల్లో దీనిపై సమాధానం ఇస్తానని అన్నామలై చెప్పారు. దీంతో తమిళనాట రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది.

**వాల్ పోస్టర్లతో మొదలైన ప్రచారం!**

తాజాగా కోయంబత్తూరు వీధుల్లో అన్నామలై ఫొటోలతో ఉన్న పోస్టర్లు వెలశాయి. దానిపై 'మైండ్స్ గేవ్ నో లిమిట్స్' అని రాసి ఉంది. దీంతో అన్నామలై కొత్త పార్టీ ప్రచారం షురూ అయ్యింది. దీంతోపాటు ఆయన మద్దతుదారుల కార్యకలాపాలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. అన్నామలై అన్బు కూట్టం తరఫున ఆయన మద్దతుదారులు కొత్త సభ్యులను, ఆఫీస్ బేరర్లను చేర్చుకునే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. అటు జాతీయ మీడియా కూడా త్వరలోనే అన్నామలై ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొంది.

**కాంగ్రెస్ నేత ట్వీట్?తో బలం!**

ప్రస్తుతం కోయంబత్తూరులోనే తమిళనాడు బీజేపీ సెంట్రల్ కమిటీ సమావేశం జరుగుతుండగా అన్నామలై హాజరుకాలేదు. వరుసగా రెండు కీలక సమావేశాలకు గైర్హాజరుకావడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి. ఈ పరిణామాలపై అన్నామలై ఇంకా స్పందించలేదు. అయితే కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం చేసిన ఒక ట్వీట్ ఈ ఊహాగానాలకు మరింత ఆజ్యం



పోసింది. తమిళనాడులో త్వరలో మరో రాజకీయ పార్టీ రాబోతోందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ పార్టీ పేరులో ఆసక్తికరమైన లాజిక్ ఉందని రాసుకొచ్చారు.

**ఆ ఆదేశాలపై అసంతృప్తి!**

ఈ విద్యాసంవత్సరం నుంచే 9వ తరగతి విద్యార్థులకు త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని కేంద్ర విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలపై అన్నామలై అసంతృప్తి వ్యక్తం చేశారు. జులై ఒకటి నుంచి సీబీఎస్ఈ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులకు మూడు భాషలను తప్పనిసరి చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నామలై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కోరారు. గతంలో నిర్ణయించినట్లుగానే 2029- 30 విద్యా సంవత్సరం నుంచే ఈ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. హఠాత్తుగా కొత్త భాషను నేర్చుకోవాల్సి రావడం తమిళనాడు విద్యార్థులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని ఎక్స్‌లో పోస్టు చేశారు. అటు అసెంబ్లీ ఎన్నికలకు ముందు మిత్రపక్షం అన్నాడీఎంకేతో అన్నామలైకి సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అన్నాదురై, జయలలితలపై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలే అందుకు కారణం. అన్నాడీఎంకే ఒత్తిడితోనే అన్నామలైను అధ్యక్ష పదవి నుంచి బీజేపీ తప్పించిందని గతంలో వార్తలు వచ్చాయి.

**కనిపించని బీజేపీ జెండా!**

కొంతకాలం తమిళనాడులో బీజేపీని బలోపేతం చేసే బాధ్యతను అన్నామలై భుజానికెత్తుకున్నారు. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఆ పార్టీకి అన్నామలై అతిపెద్ద దిక్కుగా కనిపించారు. దీంతో ఆయన పేరు నేషనల్ వైడ్‌గా మార్మోగిపోయింది. అయితే ఇప్పుడు అదే పార్టీని వీడనున్నారని వస్తున్న వార్తలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. దీనికి తోడు తాజాగా ఎయిర్‌పోర్టుకు అన్నామలై వచ్చిన కారులో బీజేపీకి సంబంధించిన జెండా లేకపోవడం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తుంది!

## దేశంలో జల వనరుల నిర్వహణ కోసం

# ఇస్రోతో కేంద్రం అగ్రిమెంట్

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రోతో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దేశంలో నీటి వనరుల నిర్వహణ కోసం శాటిలైట్ టెక్నాలజీ, అంతరిక్ష ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేసేందుకు ఈ అగ్రిమెంట్ చేసుకుంది. దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సందర్భంగా ఈ అవగాహన ఒప్పందంపై సోమవారం సంతకాలు జరిగాయి. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం జలాశయాల పర్యవేక్షణ, నీటి విస్తరణ అంచనా, నదీ ప్రవాహ విశ్లేషణ, ఉపగ్రహ ఆధారిత నీటి నాణ్యత అంచనాతో సహా 24 కీలక పరిశోధనా రంగాలలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, ఇస్రో సంయుక్తంగా పనిచేస్తాయి.

**వికసిత్ భారత్ సాధించడానికి నీటి భద్రత చాలా కీలకం : సీఆర్ పాటిల్**

డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జరిగిన వర్క్‌షాప్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ పాల్గొన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి నీటి భద్రత చాలా కీలకమని అభిప్రాయపడ్డారు. నీటికి సంబంధించిన సవాళ్లను సాంకేతికత, ఆవిష్కరణలు, సంప్రదాయ జ్ఞానం, ప్రజా భాగస్వామ్యం ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. గత దశాబ్దంలో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అనేక పరిశోధనా అధ్యయనాలకు మద్దతు ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇందులో 113 ప్రత్యక్ష ప్రాయోజిత ప్రాజెక్టులు కూడా ఉన్నాయని వెల్లడించారు. ఇవి జల రంగంలో ఆచరణాత్మక పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో సహాయపడ్డాయని తెలిపారు.

**పలు కార్యక్రమాలు ప్రారంభం**

ఈ వర్క్‌షాప్‌లో జల్ సంచయ్ జన భాగీదారీ (జేఎస్‌జీబీ) ప్రచార కార్యక్రమం మూడో దశను సీఆర్ పాటిల్ ప్రారంభించారు. 2026 జూన్-2027 మే మధ్య రెండు కోట్ల నీటి సంరక్షణ నిర్మాణాలను సృష్టించాలనే లక్ష్యాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. గత దశలో 1.5 కోట్ల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖ, అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్త చొరవతో మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్ వాటర్ ప్రోగ్రామ్‌ను కూడా సీఆర్ పాటిల్ ప్రారంభించారు. అలాగే భారత్ వాటర్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్ వేదిక కింద స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు కోసం ఓపెన్ కాల్‌ను ప్రకటిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**ఇస్రో ఛైర్మన్ ఏమన్నారంటే?**

ఈ ఒప్పందం రెండు సంస్థల మధ్య సహకారాన్ని మరింత పెంపొందిస్తుందని, నీటి నిర్వహణ కోసం ఉపగ్రహ ఆధారిత అనువర్తనాల వినియోగాన్ని బలోపేతం చేస్తుందని ఇస్రో ఛైర్మన్, అంతరిక్ష శాఖ కార్యదర్శి వి. నారాయణన్ అభిప్రాయపడ్డారు. జలవనరులను పరిశీలించడానికి, ముందస్తుగా అంచనా వేయడానికి, నిర్వహించడానికి నేటి అంతరిక్ష సాంకేతికత అపూర్వమైన సామర్థ్యాన్ని అందిస్తోందని తెలిపారు. భూగర్భ జలాల అంచనా, జలవనరుల పర్యవేక్షణ, వరదల ముందస్తు అంచనా వంటి రంగాలలో పనులకు ఈ భాగస్వామ్యం మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే ఇస్రో, జలవనరుల రంగం మధ్య సహకారం 1982 నాటిదని గుర్తు చేసుకున్నారు. మరోవైపు, మిషన్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ హై ఇంపాక్ట్ ఏరియాస్- వాటర్ కార్యక్రమం విద్యాసంస్థలు, ప్రయోగశాలలు, స్టార్టప్‌లు, పారిశ్రామిక భాగస్వాములతో కూడిన బహుళ సంస్థాగత ప్రాజెక్టులకు మద్దతు ఇస్తుందని ఏఎన్ఆర్ఎఫ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శివకుమార్ కళ్యాణ రామన్ అన్నారు. దిల్లీలోని డాక్టర్ అంబేడ్కర్ అంతర్జాతీయ కేంద్రంలో జలశక్తి మంత్రిత్వ శాఖ నిర్వహించిన జల రంగంలో పరిశోధన, అభివృద్ధిపై జాతీయ వర్క్‌షాప్ సోమవారం (జూన్ 1న) జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో సుస్థిర భూగర్భ జలాల నిర్వహణ, సాంకేతిక ఆవిష్కరణలు, వర్షపు నీటి సేకరణపై చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, పరిశోధకులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు, నిపుణులు పాల్గొని పలు విషయాలు చర్చించారు. దేశంలో నీటి ఆవిష్కరణల భవిష్యత్తుపై చర్చించడానికి నిపుణులు, పరిశోధకులకు ఈ వర్క్‌షాప్ ఒక వేదికగా మారింది.

## నీట్- యూజీ రీ ఎగ్జామ్‌పై సుప్రీం కీలక ఉత్తర్వులు- 

## ూవీ= మోడ్?లోనే పరీక్ష

2026 నీట్- యూజీ పరీక్ష నిర్వహణ విషయంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ పునఃపరీక్షను 'కంప్యూటర్ ఆధారిత పరీక్ష' (సీబీటీ) విధానంలో నిర్వహించాలని ఆర్?జేడీ ఎంపీ సుధాకర్‌సింగ్ దాఖలు చేసిన పిటిషన్?ను స్వీకరించడానికి నిరాకరించింది. ప్రస్తుతం ఉన్న పెన్? అండ్ పేపర్? విధానంలోనే నీట్ పునఃపరీక్ష నిర్వహించాలని జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. అకస్మాత్తుగా పరీక్షా విధానాన్ని మార్చడం ఆచరణాత్మకంగా కష్టమని ధర్మాసనం అభిప్రాయపడింది. సమయాభావం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్?టీఏ)పై ఉన్న ఒత్తిడిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. తర్వాత ఎంపీ సుధాకర్ సింగ్? సహా, ఇతరులు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు జూలై 27కు వాయిదా వేసింది.

**జూన్? 21న రీటెస్ట్**

మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 3న నీట్?-యూజీ పరీక్ష నిర్వహించారు. అయితే ఆ తర్వాత ఆ పేపర్ లీక్ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. దీనితో మే 12న ఎన్?టీఏ నీట్? పరీక్షను రద్దు చేసింది. విద్యార్థులు, ప్రతిపక్షాల ఒత్తిడితో కేంద్ర ప్రభుత్వం ఈ పేపర్ లీక్ కేసును సీబీఐకు అప్పగించింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. మరోవైపు విద్యార్థుల భవిష్యత్?ను దృష్టిలో ఉంచుకొని ఈ పరీక్షను తిరిగి (రీటెస్ట్?) జూన్? 21న నిర్వహించేందుకు ఎన్?టీఏ సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే ఎలాంటి లీకేజీలకు తావు లేకుండా పరీక్షను సీబీటీ విధానంలో జరపాలని కోరుతూ ఆర్?జేడీ ఎంపీ సుధాకర్? సింగ్?తో పాటు మరికొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

# ఈ సారి యోగా.. రెండు వారాలు

-మొదటిపేజీ తరువాయి

వేడుకల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు. యోగాను కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా.. ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది ( రైతులు, మహిళా స్వయం సహాయక బందాలు, మత్స్య కారులు, గిరిజనులు, వివిధ సాంస్కృతిక కళాకారులు, యువజన సంఘాల సభ్యులు, ఆటో లారీ అసోసియేషన్ ల సభ్యులు, విద్యార్థినీ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు) పౌరులను యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు. 10 లక్షల మంది నిత్య సాధకులను తయారుచేస్తామని వెల్లడించారు. గతేడాది 1.5 లక్షల మంది శిక్షకుల ద్వారా కార్యక్రమాలు జరిపామని, ఈ సంఖ్యకు అదనంగా మరో లక్ష మంది శిక్షకులను జత చేస్తునామని (మొత్తం 2.5 లక్షలు) తెలిపారు. ఈసారి కూడా యోగా, ప్రకతి వైద్య ప్రభుత్వ సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో రూపొందించిన యోగా వీడియోలను ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. యోగా దినోత్సవ వేడుకల నిర్వహణపై రాష్ట్ర సచివాయంలో మంత్రి సత్యకుమార్ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సెక్రటరీ సౌరభ్ గౌర్, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, ఆయుష్ డైరెక్టర్ జి.వీరపాండియన్, యోగా, ప్రకతి వైద్య సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజుతో కలిసి సోమవారం విలేకరుల



సమావే శంలో మాట్లాడుతూ యోగాసనాల ప్రాధాన్యతను తెలిపే విధంగా ప్రత్యేకంగా ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు కోసం పంపిన ప్రతిపాదనకు సీఎం ఆమోదముద్ర వేశారని, ఇందుకు సంబంధించిన ఫైలు ఆర్థిక శాఖ పరిశీలలో ఉందని చెప్పారు. ఈ పరిషత్ ఏర్పాటకనుగుణంగా 3 ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటవుతాయని తెలిపారు. యోగాసనాల కార్యక్రమాలకే పరిమితం కాకుండా నిరంతరం కొనసాగేలా ఈ పరిషత్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. కిందటి ఏడాది రికార్డు స్థాయిలో నిర్వహించిన యోగాసనాల కార్యక్రమాలకు రెండు గిన్నిస్ బుక్ రికార్డులు, 21 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులు , ఒక స్కోచ్ అవార్డులొచ్చాయని చెప్పారు. రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ విద్యార్థులకు జరిగే బోధనలో యోగాను అంతర్భాగంగా చేర్చారని, ఉత్తర్వులు కూడా ఇచ్చారని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే యోగాసనాల పట్ల అవగాహన ఏర్పరచడం ద్వారా బహుళ ప్రయోజనాలు లభిస్తాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే యోగాసనాల కార్యక్రమాల నిరంతర పర్యవేక్షణ, ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం కోసం మంగళగిరిలోని ఎపిఐఐసిలో ప్రత్యేకంగా ' వార్ రూం ' ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. జూన్ 21న జరిగే యోగా వేడుకల ముగింపు కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా కేంద్రాల్లో భారీఎత్తున నిర్వహిస్తారని తెలిపారు.

# స్థానిక ఎన్నికలు.. ఖర్చు భరించేదెలా


**విజయవాడ :** స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన తాజా సూచనలు పార్టీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. రానున్న ఎన్నికల్లో ఎక్కడా ఏకగ్రీవాలకు అవకాశం ఇవ్వకుండా ప్రతి చోటా అభ్యర్థులను నిలబెట్టాలని ఆయన స్పష్టంగా ఆదేశించినట్లు సమాచారం. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో పోటీ ఉండేలా చూడాలని, అభ్యర్థుల కొరత అనే కారణం వినిపించకూడదని ఆయన సూచించారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అవసరమైతే బీసీ, ఎస్సీ వంటి వర్గాల నుంచి కొత్త కార్యకర్తలను ప్రోత్సహించి ఎన్నికల బరిలోకి దింపాలని కూడా ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. దీని ద్వారా స్థానిక స్థాయిలో పార్టీ బలం ఏ మేరకు ఉందో పరీక్షించుకోవాలన్న ఉద్దేశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.ఇక రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న వైఎస్ఆర్ ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నప్పటికీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన పోరాటం కొనసాగిస్తున్నప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అన్న సందిగ్ధంలో చాలా మంది కార్యకర్తలు ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, సర్పంచ్ వంటి పదవులకు పోటీ చేయాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక సర్పంచ్ స్థానం కోసం కనీసం 20 లక్షల నుంచి 30 లక్షల రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోందని, గెలిచినా ప్రతిపక్షంలో ఉండటంతో అభివృద్ధి పనులపై ప్రభావం ఉండదన్న భావన కూడా ఉందని చెబుతున్నారు.ఇదే సమయంలో ఆర్థిక పరిస్థితులు కూడా కేడర్‌ను వెనక్కి లాగుతున్నాయని సమాచారం. చాలా మంది చిన్నస్థాయి నాయకులు,



కార్యకర్తలు ఇంత భారీ ఖర్చును భరించలేమని భావిస్తున్నారని పార్టీ అంతర్గత చర్చల్లో వెలుగులోకి వస్తోంది. అయితే పార్టీ అధినాయకత్వం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతి స్థానంలో పోటీ చేయాల్సిందే అని గట్టిగా సూచిస్తుండటంతో ఇంచార్జిలు సర్దుబాటు మార్గాలను వెతుకుతున్నారని అంటున్నారు. నియోజకవర్గ స్థాయిలో ఉన్న నాయకులు కొంత ఆర్థిక సహాయం అందిస్తారా అనే ఆశతో కొందరు ఎదురుచూస్తున్నట్లు తెలుస్తోంది.రానున్న రెండు మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సన్నాహాలు వేగవంతం చేస్తోంది. అధికార కూటమి ప్రభుత్వం కూడా ఈ ఎన్నికలను తమ పరిపాలనపై ప్రజల్లో విశ్వాసాన్ని చూపించే అవకాశంగా చూస్తోంది. అదే సమయంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి, ఎన్నికల్లో ఆధిక్యం సాధించేందుకు వ్యూహాలు రూపొందిస్తోంది. ఈ పరిస్థితుల్లో వైసీపీ కూడా పోటీకి పూర్తిగా సిద్ధమవుతూ ప్రతి గ్రామంలో పోరాటం కొనసాగించాలని భావిస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో ఆర్థిక ఒత్తిళ్లు, అభ్యర్థుల ఎంపిక సమస్యలు పార్టీ వ్యూహానికి సవాల్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పరుగులు పెడుతున్న పోలవరం పనులు

**ఏలూరు :** పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అత్యంత ముఖ్యమైన, దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న బహుళార్థక ప్రాజెక్టుగా గుర్తించబడుతోంది. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ఈ ప్రాజెక్ట్ వివిధ దశల్లో కొనసాగుతూ వస్తోంది. ప్రతిపాదన స్థాయి నుంచి పూర్తిస్థాయి నిర్మాణం వరకు ఇంత భారీ సమయం తీసుకున్న ప్రాజెక్ట్ దేశంలో చాలా అరుదు. అయినప్పటికీ ఇది రాష్ట్ర అభివృద్ధికి జీవనాడిగా భావించబడుతోంది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 2024 నుంచి ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. 2027 జూలైలో జరిగే గోదావరి పుష్కరాల కంటే ముందే ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేయాలని లక్ష్యంగా పెట్టుకుని వేగంగా పనులు కొనసాగిస్తోంది. ఈ లక్ష్యంతో వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.ప్రాజెక్ట్‌లో కీలకమైన భాగమైన ఎడమ కాలువ పనులు ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. గోదావరి నది (జలాలను ఉత్తరాంధ్ర ప్రాంతానికి తరలించడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశాలలో ఒకటి. ముఖ్యంగా అనకాపల్లి , విశాఖపట్నం ( ప్రాంతాలకు నీటి సరఫరా అందించేందుకు ఈ కాలువ కీలక పాత్ర పోషించనుంది.ఎడమ కాలువలో నేషనల్ హైవేలు క్రాసింగ్ వద్ద బ్రిడ్జ్ నిర్మాణాలు, ఇతర ఇంజినీరింగ్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకుంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.ప్రణాళిక ప్రకారం మరో కొన్ని నెలల్లో ఎడమ కాలువ పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. ఆ తర్వాత గోదావరి జలాలను అనకాపల్లి వరకు తరలించే ప్రక్రియను ప్రారంభించేందుకు సిద్ధం



అవుతున్నారు. ఆగస్టు నెలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కాలువను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.ఈ పనుల్లో ఆలస్యం జరగకుండా ఉండేందుకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. పనుల్లో నిర్లక్ష్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని కూడా సూచించారు.ఇక మరో ముఖ్యమైన ప్రాజెక్ట్ వెలిగొండ ప్రాజెక్ట్ పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. టన్నెల్-2లో 5.2 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేయడం ఒక కీలక మైలురాయిగా భావించబడుతోంది. హెడ్ రెగ్యులేటర్లు, రిటైనింగ్ వాల్ వంటి నిర్మాణాలు కూడా పూర్తి అయినట్లు సమాచారం.అప్రోచ్ ఛానెల్‌లో ఉన్న మట్టిని తొలగించడం, టన్నెల్-1 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. జూన్ చివరి నాటికి అవసరమైన ప్రధాన పనులు పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ పనుల ద్వారా రాష్ట్రంలో నీటి వనరుల నిర్వహణ మరింత బలపడనుంది.

## దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

-మొదటిపేజీ తరువాయి

కూడా ప్రజలు తెలుసుకోవాలి. సుపరిపాలన వైకుంఠపాళీ కాకూడదన్నదే మా విజ్ఞప్తి. గత పాలకులు ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక 241 కేసులు వేసినా వాటిని పరిష్కరించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. గత పాలకులు జాబ్ క్యాలెండర్ అని దానిని ఎగ్గొట్టారు. మళ్లీ మా ప్రభుత్వం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశాం. అత్యంత పటిష్టంగా ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టాం. 40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నా పత్రాలు వెరసి ఎక్కడా అక్రమాలు జరక్కుండా చూశాం. కానీ ఫ్రస్టేషన్ లో ఉన్న వైసీపీ పార్టీ దానిని వివాదం చేసి రాజకీయ లబ్ది పొందాలని ఆలోచన చేస్తోంది. వైసీపీ దీనిని వివాదం చేసి సమాజంలో అశాంతిని రేపేందుకు ప్రయత్నాలు చేసింది. జాగ్రత్తగా ఉండబట్టే దీనికి గట్టిగా సమాధానం ఇవ్వగలిగాం. ప్రతిపక్షంలో పరామర్శలకు వెళ్తూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపేసి పొదల్లోకి విసిరేసి పోయారు. కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి హత్యాయత్నం డ్రామాలు ఆడారు. దానిని మాపై నెట్టేందుకు ప్రయత్నించారు. పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ ప్రమాదంలో చనిపోతే దానిని కూడా మాపై నెట్టడానికి ప్రయత్నాలు జరిగాయి.

సీసీ కెమెరాల సాయంతో ఈ కుట్రను బట్టబయలు చేయగలిగాం. కడపలో పెద్ద దస్తగిరిని వైసీపీ వారే ఆస్తుల వివాదంలో హత్యచేసి టీడీపీ వారిపై నెట్టేందుకు ప్రయత్నం చేశారు. నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే. అయినా మేం 20 నిముషాల్లో నిందితున్ని పట్టుకున్నాం. వైసీపీ వాళ్లే చేశారు కాబట్టే సాక్షిపత్రికలో ఆ వార్తే రాయలేదు. కేవలం సానుభూతి పొందడానికే ఈ కుట్రపన్నారు. రాక్షసులు, దుర్మార్గులతో యుద్ధం చేస్తూనే సుపరిపాలన యజ్ఞం చేస్తున్నాం. కాకినాడలోనే వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేశారు. కానీ వైసీపీ ఆ ఎమ్మెల్సీకి సన్మానాలు చేసింది. ఇంత కుట్రలకు కుతంత్రాలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయమని హెచ్చరిస్తున్నాం. రాజకీయ పార్టీగా ఈ తంతును సరిచేసుకోవాల్సింది పోయి ఎదురు దాడి చేస్తున్నారు.. ఈ తరహా ఘటనల్ని ప్రజలు గమనించాలని నేను కోరుతున్నాను. రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యం. హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని కనీసం పార్టీ నుంచి సస్పెండ్ కూడా చేయకుండా వెనక తిప్పుకుంటున్నారని చంద్రబాబు ధ్వజమెత్తారు.

## గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు కట్టకపోవడమేంటి?

-మొదటిపేజీ తరువాయి

పంచుకున్నారు. పరిశ్రమలు పంచాయతీలకు పన్ను చెల్లించకపోవడంపై పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లాభాలు సంపాదించే పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలాగని అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు కట్టకపోవడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆంధ్రా పేపర్ మిల్స్ రూ.19 కోట్లు బకాయిలు పెట్టిందని గుర్తు చేశారు. విద్యాసంస్థలపై కూడా భారీగా పన్ను బకాయిలున్నాయన్నారు. రాష్ట్రంలో పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకుపైగా వస్తాయన్నారు.

**అధికారులకు దిశానిర్దేశం**

పన్నులు చెల్లించని కారణంగా ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు కూడా ఇబ్బందులు తలెత్తాయన్నారు. పేదలు, కులవృత్తులవారు, చిరుద్యోగులు కూడా పన్నులు చెల్లిస్తున్నారన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు పన్నులు కట్టని విషయం ప్రజలకు తెలియదన్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా పన్నుల విషయంలో ముందుకెళ్లాలని అధికారులకు పవన్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సీఎంతో పాటు మంత్రివర్గంతోనూ మాట్లాడతానని పవన్ అధికారులతో చెప్పారు. పల్స్ సర్వే తరహాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నుల వసూళ్ల కార్యాచరణ చేపట్టాలని అధికార యంత్రాంగానికి ఈ సందర్భంగా పవన్ దిశానిర్దేశం చేశారు.

ఏపీలో పంచాయతీల్లో పన్నులు సక్రమంగా వసూలైతే గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, చెత్త వంటి సమస్యలేవీ ఉండవని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పన్నులు చెల్లించకుండా మొండి బకాయిలు పెట్టిన పరిశ్రమలు, విద్యాసంస్థల పంచాయతీ అధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

“కొన్నిచోట్ల పరిశ్రమల యజమానుల నుంచి రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. పంచాయతీలకు వివిధ రకాల పన్నుల ద్వారా రూ. 5,400 కోట్లు వచ్చే అవకాశముంది. సరిగ్గా వసూలు చేస్తే ఎక్కడా ఎలాంటి సమస్యలుండవు. ఇందులో ప్రధానంగా పేదవర్గాల వారు, వివిధ రకాల కులవృత్తులు చేసుకునేవారు, చిరుద్యోగులు కూడా ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నప్పుడు కోట్ల రూపాయలు ఆదాయం వచ్చే పరిశ్రమలు, విద్యాసంస్థలు ఎందుకు చెల్లించడం లేదు. లాభాలు వచ్చే సంస్థలు పన్నులు చెల్లించకపోతే అధికారులెందుకు చర్యలు తీసుకోవటం లేదు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు, అవసరమైతే దీనిపై సీఎం చంద్రబాబుతో పాటు మంత్రివర్గంతో మాట్లాడతాను. పన్ను వసూళ్లపై ఫైల్స్ సర్వే మాదిరిగా మూడు రోజులు వరుసగా డ్రైవ్ చేయాలి.”-పవన్ కళ్యాణ్, ఉపముఖ్యమంత్రి

## ఏఐ హబ్‌గా విశాఖ ఎదుగుదల

-మొదటిపేజీ తరువాయి



డేటా హైపర్‌స్కేల్ హబ్‌గా వైజాగ్ వేగంగా ఆవిర్భవిస్తోందన్నారు. గూగుల్ ఏఐ హబ్, రిలయన్స్ ఏఐ డేటా సెంటర్, అదానీ కనెక్స్ వంటి ప్రధాన ప్రాజెక్టులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు అన్ని విధాలా అనుకూలమైన విశాఖపట్నం డేటా సెంటర్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందని వివరించారు. విశాఖ నగరంలో 6 గిగావాట్ల డేటా సెంటర్లను నెలకొల్పాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని లేకేశ్? స్పష్టం చేశారు. మల్టీ-గిగావాట్ ఏఐ మౌలిక వసతులు, సంపూర్ణ ఎకోసిస్టమ్ అభివృద్ధిపై దృష్టి పెట్టామని వివరించారు.

**విశాఖలో క్యాంపస్‌కు ఆహ్వానం**

ఎయిర్‌ట్రంక్ ఫ్యూచర్ క్యాంపస్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్? కోరారు. భారతదేశంలో మరే ఇతర ప్రాంతాల్లో లేని కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు విశాఖలో ఉన్నాయన్నారు. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ కోసం రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు కూడా సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఏపీలో ఎయిర్‌ట్రంక్ పెట్టుబడులు పెట్టాలని మంత్రి లోకేశ్? (వీఱఅఱర్‌వతీ ౫శీఎవంష్ట్ర) విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌ట్రంక్‌తో సంబంధాల పునరుద్ధరణ, భారతదేశంలో తదుపరి దశ విస్తరణ, ఏఐ-హైపర్‌స్కేల్ మౌలిక వసతులు, ఏపీని ప్రాధాన్య గమ్యస్థానంగా నిలపడంపై చర్చించారు.

**ప్రతిపాదనలు పరిశీలిస్తాం**

దీనిపై స్పందించిన రాబిన్ ఖుదా ఎయిర్‌ట్రంక్ ఇండియా ప్రణాళికలు, మినా క్లౌడ్‌ఇన్‌ఫ్రాను స్వాధీనం చేసుకున్న తర్వాత దాని ఏకీకరణ, భారతదేశంలో ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు, విస్తరణ రోడ్‌మ్యాప్, కీలక కస్టమర్ల సేవలు, హైపర్‌స్కేలర్ అవసరాలపై వివరించారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

**అత్యుత్తమ విధానాలు తెలుసుకున్నారు**

ఎయిర్‌ట్రంక్ సీఈవోను కలవడానికి ముందు లోకేశ్ మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముంబయిలో భేటీ అయ్యారు. సాదర స్వాగతం పలికిన సీఎంను మంగళగిరి చేనేత శాలువాతో సత్కరించి, శ్రీవారి ప్రతిమను లోకేశ్ అందజేశారు. గణేశ్ ప్రతిమను లోకేశ్‌కు సీఎం దేవేంద్ర బహూకరించారు. ఏపీకి వచ్చిన పెట్టుబడులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మహారాష్ట్ర సీఎంకి వివరించారు. ఏపీ విద్యా శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలు, స్కిల్ డెవలప్‌మెంట్ విధానాలు తెలియజేశారు. మహారాష్ట్ర ఐటీ, విద్యా శాఖలో అమలవుతున్న అత్యుత్తమ విధానాలు సీఎంను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా పక్షం.. ప్రజా గొంతు..
జయ జయహే సూర్యోదయం
https://suryodhayam.com/
https://epaper.suryodhayam.com/
MANA SHOW
మంగళవారం
2 జూన్
2026

# శాతవాహనలో రెండవ రోజు వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షలు

## యువత క్రీడా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి : ఆచార్య ఉమేష్



**కరీంనగర్ :** శాతవాహన విశ్వవిద్యాలయం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న వ్యాయామ విద్య-2026 ప్రవేశ పరీక్షలను రెండవ రోజు విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ మొదటిరోజు పరీక్షలు చాలా కట్టుదిట్టంగా నిర్వహించామని వ్యాయామ విద్య పరీక్షలకు ఉన్న డిమాండ్ అనుసరించి కళాశాలలో సీట్లు పెరగాలని, అభ్యర్థులు శారీరక నైపుణ్య పరీక్షలో తమ యొక్క ప్రతిభను చూపాలని దానితో వారికి మెరుగైన మార్కులతో మంచి కళాశాలలో సీటు లభించే అవకాశం కలుగుతుందన్నారు. ప్రస్తుతం పరిమితమైన సీట్లు ఉన్నాయని దాంతో పోటీలలో అభ్యర్థులు తమ శక్తిమేరకు ప్రయత్నం చేసి శారీరక దృఢత్వ పరీక్ష, నైపుణ్య అభివృద్ధి పరీక్షలలో ప్రతిభ చాటుతూ తెలంగాణ పిఈసెట్ 2026 కి అర్హత సాధించాలని కోరారు. కొంతమంది అభ్యర్థులకు జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొన్నట్లయితే వారికి అదనంగా మార్కులు లభించే అవకాశం ఉన్నదని, నైపుణ్యా లను ఇంకా మెరుగుపరుచుకోవాలని వచ్చే సంవత్సరంలోగా తాము 'బహుళ ప్రయోజన కాంప్లెక్స్' నిర్మాణాన్ని పూర్తిచేసి, అత్యాధునిక వసతులు కల్పించి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ మాట్లాడుతూ క్రీడలతో మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని, అభ్యర్థులు శారీరకంగా దృఢత్వంగా ఉండడానికి ప్రత్యేక సాధన చేసి శక్తి మేరకు సత్తా చాటి ప్రతిభ సాధించాలన్నారు. వ్యాయామ విద్య ప్రవేశ పరీక్షల కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ మాట్లాడుతూ వేసవి తాపం వలన అభ్యర్థులు అలసిపోకుండా ఉండడానికి ఉదయం 6:30 నుండి అన్ని సౌకర్యాలతో పరీక్షలు నిర్వహిస్తున్నామని రేపటినుండి మహిళలకు పరీక్షలు జరుగుతాయని, అనుభవిజ్ఞులైన టెస్టర్ లతో అభ్యర్థులకు దేహదారుఢ్య శారీరక పరీక్షలు నిర్వ నిర్వహిస్తున్నామని తెలిపారు. రెండవరోజు బ్యాచిలర్ వ్యాయామ విద్యలో 712 దరఖాస్తు చేసుకోగా అందులో 531 మంది ప్రవేశ పరీక్షలో పాల్గొనగా 181 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని అలాగే డిప్లమా వ్యాయామ విద్యలో 285 మంది దరఖాస్తు చేసుకోగా 190 మంది పరీక్షలకు హాజరవుగా 95 మంది గైర్హాజరయ్యారని శారీరిక సామర్థ్య పరీక్షల్లో భాగంగా పురుషుల విద్యార్థులకు 100 మీటర్లు, 800 మీటర్ల పరుగు, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్ పోటీలు నిర్వహించామని శరీర నైపుణ్య పరీక్షలకు సంబంధించి ఫుట్ బాల్ , వాలీబాల్, ఖో ఖో, క్రికెట్, కబడ్డీ పరీక్షలు నిర్వహించి నైపుణ్య పరీక్షలను పూర్తి చేశారని తెలిపారు. ఈ వ్యాయామ విద్య పరీక్ష రెండవ రోజు రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్, శాతవాహన స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ నజీముద్దీన్ మునవర్, డాక్టర్ దీప్లా, డాక్టర్ జగన్, డాక్టర్ సుధాకర్ రావు,ఆచార్య సునీల్ కుమార్, శాతవాహన పీడీ విజయ్ కుమార్,వివిధ విశ్వవిద్యాలయ వ్యాయామ అధికారులు, వ్యాయామ శిక్షకులు పాల్గొని పరీక్షలను నిర్వహించారు.

# పుష్కరాల తెలంగాణ అష్టకష్టాల నుంచి అభివృద్ధి దాకా...



**హైదరాబాద్ :** ఆదిలాబాద్ అడవుల నుంచి ఖమ్మం గుమ్మం దాకా, పాలమూరు పల్లెల నుంచి మెతుకుసీమ గడపల దాకా, ఓరుగల్లు కోటల నుంచి హైదరాబాద్ గల్లీల దాకా వినిపించిన ఆకాంక్ష తెలంగాణ. ఇందూరు, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల ప్రజలు అలుపెరగక పోరాడి సాధించుకున్న గడ్డ ఇది. వందల వేలమంది చావును ముద్దాడి, తమ ఊపిరిని ధారపోసి తెచ్చుకున్న స్వరాష్ట్రం త్యాగాల పునాదిపై నిర్మితమైంది. 'మా కొలువులు మాగ్గావాలె' అనే నినాదం ఉవ్వెత్తున ఎగసి, దశాబ్దాల పాటు రగులుతూనే ఉంది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానం చివరకు 2014 జూన్ రెండో తేదీన సఫలీకృతమై, భారతదేశపు 29వ రాష్ట్రంగా తెలంగాణ ఉద్భవించింది. ఈ సువర్ణ అధ్యాయం వెనుక దాగి ఉన్న కీలక ఘట్టాలను, మైలురాళ్లను స్మరించుకోవడం మన బాధ్యత. నిజాం పాలనలో ఉన్న ఈ ప్రాంతం 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ స్టేట్‌గా భారత యూనియన్‌లో విలీనమైంది. అనంతరం 1956 నవంబర్ 1న భాషాప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఆంధ్ర రాష్ట్రంతో విలీనం చేయబడి ఆంధ్రప్రదేశ్‌లో భాగమైంది. భౌగోళిక, సంస్కృతిక వైవిధ్యం కలిగిన ఈ ప్రాంతం విలీనం కావడం వెనుక ఎన్నో ఆశలు, ఆకాంక్షలు దాగి ఉండేవి. అధికార పంపిణీలో సమతుల్యత కోసం నాటి మేధావులు పెద్ద మనుషుల ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో జనాభా నిష్పత్తి పాటించాలని, తెలంగాణలో స్థిరపడాలంటే 12 ఏళ్ల నివాస నిబంధన ఉండాలని నిర్ణయించారు. కేబినెట్‌లో 40 శాతం మంత్రి పదవులు తెలంగాణకు కేటాయించడం, ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతం వారైతే ఉప ముఖ్యమంత్రి తెలంగాణ వారై ఉండాలని కచ్చితమైన షరతులు విధించారు. ఈ ఒప్పందాలు కాగితాలకే పరిమితం కావడం తెలంగాణ సమాజంలో తీవ్రమైన అసహనాన్ని, నిరసనను రేకెత్తించాయి. తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటా నిధులు పక్కదారి పట్టడం ఆందోళనలను మరింత తీవ్రతరం చేశాయి. వశిష్ట భార్గవ కమిటీ వెల్లడించిన గణాంకాల ప్రకారం 1956 నుంచి 1968 మధ్య కాలంలో రూ. 28.3 కోట్ల తెలంగాణ మిగులు నిధులు ఆంధ్రా ప్రాంతానికి మళ్లించబడ్డాయి. ముల్కీ నిబంధనలను కాలరాస్తూ 4500 మంది ఆంధ్రా ఉద్యోగులు తెలంగాణలో పని చేయడం నిరుద్యోగ యువతను ఆవేదనకు గురిచేసింది. ఈ వివక్షపై 1969లో జరిగిన తొలి దశ ఉద్యమం మర్రి చెన్నారెడ్డి సారథ్యంలో రాజకీయ రూపం దాల్చినా, అది ఆశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. ఈ వైఫల్యం తర్వాత ఉద్యమ తీవ్రత కొంతకాలం తగ్గినట్లు కనిపించినా, నిప్పురవ్వలు లోలోపల రగులుతూనే ఉన్నాయి. కొత్త శతాబ్దంలో తెలంగాణ ఆకాంక్షలు మళ్లీ ఉధృతమయ్యాయి. 2001లో కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి ప్రత్యేక రాష్ట్ర సాధనను ప్రధాన ఎజెండాగా తీసుకుంది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జతకట్టినప్పటికీ ఆశించిన ఫలితం రాకపోవడంతో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి టీఆర్ఎస్ వైదొలిగింది. 2006లో కేంద్ర మంత్రి పదవికి, ఎంపీ పదవికి కేసీఆర్ రాజీనామా చేసి, ఉపఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలవడం ద్వారా తెలంగాణ సెంటిమెంట్‌ను మరోసారి దేశం దృష్టికి తీసుకెళ్లారు. 2008లో కూడా ఇదే ఒరవడిని కొనసాగించడం ద్వారా ఉద్యమ తీవ్రతను చాటారు. ప్రజల నాడిని పట్టుకున్న కేసీఆర్, రాజకీయ ఎత్తుగడలతో ఉద్యమాన్ని మలుపు తిప్పడంలో విజయం సాధించారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్యమ గమనాన్ని ఒక్కసారిగా మార్చేసింది. 'తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో' అనే నినాదం మారుమో గుతుండగా, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగింది. ఈ దీక్షా ఫలితంగా 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రకటించారు. ఆ తర్వాత సమైక్యాంధ్ర ఉద్యమాలతో పరిస్థితులు సంక్లిష్టంగా మారినా, శ్రీకృష్ణ కమిటీ నివేదిక అనంతరం రాజకీయ పరిణామాలు వేగంగా సాగాయి. చివరకు 2013 అక్టోబర్ 3న కేంద్ర మంత్రివర్గం తెలంగాణ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పార్లమెంటు వేదికగా సుదీర్ఘ చర్చల తర్వాత, 2014 ఫిబ్రవరి 18న లోక్ సభలో, ఫిబ్రవరి 20న రాజ్యసభలో తెలంగాణ బిల్లు ఆమోదం పొందింది. మలిదశ ఉద్యమంలో ఎందరో త్యాగధనులు తమ ప్రాణాలను అర్పించారు. 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 3 వరకు ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. కేసీఆర్ అరెస్టుకు నిరసనగా ఎల్బీ నగర్ చౌరస్తాలో శ్రీకాంతాచారి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి డిసెంబర్ 3న అమరుడయ్యారు. మలిదశ ఉద్యమంలో తొలి అమరుడిగా చరిత్రలో నిలిచిన శ్రీకాంతాచారి త్యాగం ఎందరినో కదిలించింది. డిసెంబర్ 23న ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా సీమాంధ్రలో ఉద్యమాలు పెరగడం, అక్కడ ఎంపీలు రాజీనామా చేయడం వంటి పరిణామాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రక్రియను తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టింది. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా తెలంగాణ సమాజం పోరాటాన్ని కొనసాగించింది. కాంగ్రెస్, బీజేపీ మద్దతుతో పార్లమెంటులో ఆమోదం పొందిన ఈ బిల్లుకు మార్చి 1న రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోద ముద్ర వేయడంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. అన్ని చట్టపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని 2014 జూన్ 2న తెలంగాణ స్వయంప్రతిపత్తి కలిగిన రాష్ట్రంగా ఆవిర్భవించింది. ఆ రోజు నుంచి నేటి వరకు తెలంగాణ ప్రజానీకం ప్రతి ఏటా జూన్ 2ను ఆవిర్భావ దినోత్సవంగా ఘనంగా జరుపుకుంటున్నారు. ప్రతి ఏటా అమరవీరుల స్తూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులు అర్పించి, జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా మారింది. ఈ ఉత్సవాలు కేవలం సంబరాలు మాత్రమే కాదు, సాధించిన ప్రగతిని సమీక్షించుకునే వేదికలు. 2026 నాటికి తెలంగాణ పదకొండు ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని, పన్నెండవ ఏట అడుగుపెట్టింది. వేలాది మంది త్యాగధనుల కన్నీటి చుక్కలే నేటి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి ప్రాణం పోశాయని, ఈ ప్రస్థానం సమున్నతమైనదని గతం చెబుతున్న సత్యం. గడిచిన కాలంలో రాష్ట్రం సాధించిన ప్రగతి, ఎదుర్కొన్న సవాళ్లు రాబోయే తరాలకు దిక్సూచిగా మారుతున్నాయి. పరిపాలనా సంస్కరణల ద్వారా 33 జిల్లాల ఏర్పాటు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి వంటివి అద్భుతమైన మైలురాళ్లు. తెలంగాణ కీర్తిని దశదిశలా చాటిచెప్పే దిశగా రాష్ట్ర ప్రగతి నిరంతరం కొనసాగుతూనే ఉంది. ఈ స్ఫూర్తితోనే భావి తరాలు అభివృద్ధి బాటలో మరింత వేగంగా దూసుకుపోవాలని ఆకాంక్ష.

## తెలంగాణ ప్రజలకు పవన్ క్షమాపణ చెప్పాలి

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో జనసేన అధినేత, ఏపీ పవన్ కల్యాణ్ నిర్వహించ తలపెట్టిన 'నవనిర్మాణ సభ'పై తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పిన తర్వాతే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును గతంలో పవన్ కల్యాణ్ తీవ్రంగా వ్యతిరేకించారని మంత్రి పొన్నం గుర్తుచేశారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను 11 రోజుల పాటు అన్నం ముట్టలేదని పవన్ చెప్పిన విషయాలను ప్రస్తావిస్తూ... అసలు ఏ నైతిక హక్కుతో ఆయన హైదరాబాద్‌లో ఇంత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. "తెలంగాణ దృష్టి పడితే కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోతాయి" అంటూ గతంలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, భావాలను తీవ్రంగా గాయపరిచాయని పొన్నం మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలపై పవన్ సమాధానం చెప్పి తీరాలన్నారు. తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం, ఇక్కడి ప్రజల మధ్య విభేదాలు సృష్టించి ద్వేషాన్ని నింపేందుకు పవన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీని వెనుక బీజేపీతో పవన్‌కు ఉన్న 'తెరవెనుక ఒప్పందం' స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. ఈ సభ నిజంగా అభివృద్ధి కోసమే అయితే గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో పెట్టుకోవచ్చు కదా... కేవలం హైదరాబాద్‌లోనే ఎందుకు పెడుతున్నారని మంత్రి ప్రశ్నించారు. ఏపీ ప్రజలు పవన్‌కు బాధ్యతాయుతమైన పదవి ఇచ్చారని, తెలంగాణ రాజకీయాల్లో జోక్యం చేసుకోకుండా... వైజాగ్ స్టీల్ ప్లాంట్ వంటి ఆంధ్రప్రదేశ్ సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. పవన్ గనుక క్షమాపణ చెప్పకపోతే తెలంగాణ ప్రజలు ఈ సభను తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించారు

## పాత అంబాపురం గ్రామములో కార్డెన్ సెర్చ్



గురజాల, జూన్, 1, సూర్యోదయం ప్రతినిధి

గురజాల మండలంలోని పాత అంబాపురం గ్రామంలో సోమవారం కార్డెన్ సెర్చ్ డి.ఎస్పి మల్ల మహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆపరేషన్లో ద్విచక్ర వాహనాలు ,గొడ్డళ్లు, కత్తులు, పలువులు, స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు డి.ఎస్.పి మల్ల మల్లేశ్వరరావు సీ.ఐ ఆవుల భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఈ ఆపరేషన్లో పాల్గొని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామములో నేర నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా పాత అంబాపురం గ్రామప్రాంతంలో అకస్మికంగా కార్డెన్ సెర్చ్చేపట్టారు. ఇంటింటికి తనిఖీల్లో భాగంగా నిర్వహించిన 2గొడ్డళ్లు, కత్తులు6, పలుగులు3, అలాగే లైసెన్సులు లేని వాహనాలను సీల్ చేశారు. వాహన దారులకు తెలియజేయమని ఏమనగా మీ బండ్ల యొక్క లైసెన్సులు ఉంటే తీసుకొని వచ్చి మీ బండ్లను మీరు తీసుకుని వెళ్లవచ్చని డీఎస్పీ మల్ల మహేశ్వరావు తెలియజేశారు. అదేవిధంగా గంజాయి వినియోగం అక్రమ రవాణాలపై పోలీసు నిఘా పెట్టినట్టు తెలిపారు .యువత చెడు అలవాటులకు లోన్ అవ్వకుండా తల్లిదండ్రులు పిల్లలు నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని ఆయన సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ ఎలాంటి అనుమానస్పత కార్యక్రమాలు తెలిసినవెంటనే పోలీస్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈకార్డన్ చర్చ్ సమావేశంలో గురజాల, దాచేపల్లి, సిఐలు5, గురజాల ఎస్పై వినోద్ కుమార్, సుమారుగా 50 మంది పోలీస్ సిబ్బందితో కార్టెన్ సెర్చ్ నిర్వహించారు.

## పల్లె గుంత గ్రామంలోఇంటింటికి ఎన్టీఆర్ భరోసాపెన్షన్,పంపిణీ



గురజాల, జూన్ , సూర్యోదయం ప్రతినిధి

గురజాల మండలంలోని పల్లె గుంత గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద ఇంటింటికీ పెన్షన్ పంపిణీ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జాస్తి ప్రకాష్ రావు పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు ఇంటి వద్దకే వెళ్ళి అందజేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం పట్ల కట్టుబడి ఉందని, అర్హులందరికీ న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు, విడో మహిళలకి అనేక వర్గాలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వం అన్ని వేలలు అండగా ఉంటుందని, ఎవరు నిరాశ చెందవద్దని జాస్తి ప్రకాష్ రావు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుండే వృద్ధులుకి 4000, వికలాంగులకు 6000, శాశ్వత వికలాంగులకు 15000 రూపాయలు ఇస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్ణయ్య, వెంకటరామయ్య, నరేష్, బ్రహ్మయ్య, డిజిటల్ అసిస్టెంట్ సలీం భాష ,కూటమి నాయకులు ,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల నుండి ఈ హెచ్ ఎస్ చందా వసూలు చేయడం మానుకోవాలి

**తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్లజాయింట్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్**

**హైద్రాబాద్ :** ఈహెచ్ఎస్ పథకం కింద రాష్ట ప్రభుత్వం ఉద్యోగుల నుండి ఒకటిన్నర శాతం చందా వసూలు చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల స్టేట్ జాయింట్ స్ట్రగుల్ కమిటీ చైర్మన్ తిరుగతం ప్రభాకర్ కన్వీనర్ సయ్యద్ షౌకత్ అలీ, కో- కన్వీనర్లు ఎస్ దేవేందర్, బత్తుల మురళిధర్ గౌడ్, టి హరి కిషన్ తెలిపారు. సోమవారం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ స్ట్రగుల్ కమిటీ సమావేశం రాష్ట్ర సమావేశం కమిటీ చైర్మన్ టి ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్లోని రాష్ట్ర కార్యాలయం జరిగింది ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలోని మెజారిటీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు పెన్షనర్లు ఎవరు కూడా ఈ హెచ్ ఎస్ చందా ఇవ్వడానికి సుముఖంగా లేరని, ఇది నియమ నిబంధనలకు విరుద్ధమని వారు తెలిపారు. కేవలం నాయకులుగా చలామణి అవుతున్న కొందరు వ్యక్తుల వ్యక్తిగత అభిప్రాయాన్ని సార్వజనికం చేయడం అసమంజసమని వారు ఆక్షేపించారు. ఈహెచ్ఎస్ పై పూర్తి స్థాయిలో చర్చ లేకుండా కేవలం నాయకులుగా చలామణి అవుతున్న కొందరు వ్యక్తుల సమ్మతి అని చెప్పి, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ వర్గాల మనోభావాలకు విరుద్ధంగా, ఉద్యోగుల వాటాగా ఒకటిన్నర శాతం చందా మినహించడం ప్రభుత్వపరంగా జరిగిన పెద్ద పొరపాటని, దానికి ఉద్యోగ వర్గాల నుండి వ్యక్తమవుతున్న వ్యతిరేకతే నిదర్శనమని వారు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో 2006 సంవత్సరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ జాయింట్ స్ట్రగుల్ కమిటీని పునరుద్ధరణ చేయడానికి నిర్ణయం తీసుకున్నామని, త్వరలో భావసారుప్యం గల అన్ని సంఘాలతో